
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట 5
శుక్రవారం 28 జూన్ 2024





రోజారాధాకృష్ణశర్మను సన్మానిస్తున్న మంత్రి పొన్నం, ఎమ్మెల్యేలు హరీశ్, ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి



పదవీకాలం పూర్తవుతుండడంతో మంత్రి పొన్నం ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మ, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డితో జడ్పీటీసీలు, ఎంపీపీలు

ఎన్నికల వరకే రాజకీయాలు - పొన్నం ప్రభాకర్

ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవచేసుకునే అదృష్టం అందరికీ రాదని, ఈ అవకాశం వచ్చినవారు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఎన్నికల వరకే పోరాటాలు, రాజకీయాలని, మిగతా సమయమంతా ప్రజాసేవలోనే ఉండాలన్నారు. ప్రజాజీవితం చాలా గొప్పదన్నారు. ఐదేళ్లలో జడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా ప్రజాసేవలో ఉన్నవారంతా భవిష్యత్తులోనూ పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. ఇలాంటి వారికి తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని చెప్పారు. గతంలో జిల్లా మంత్రిగా ఉన్న హరీశ్‌రావు సహకారం ఉందని, ఇప్పుడు తన సహకారం ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరు గ్యారంటీల ఆచరణ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. నిధుల పరంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ ఐదేళ్లపాటు ప్రజాప్రతినిధిగా సేవ చేశారని ప్రశంసించారు. తమ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా సేవ చేస్తోందని ఆయన తెలిపారు.

పదవుల కన్నా ప్రజాసేవ మిన్న - హరీశ్‌రావు

పదవులు తాత్కాలికమని, ప్రజాసేవ శాశ్వతంగా ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పదవుల కన్నా ప్రజాసేవ మిన్న అంటూ హితబోధ చేశారు. మంచిపనులు చేయడానికి పదవులే ఉండాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండాలన్నారు. ఇక జడ్పీకి ప్రాతినిధ్యం వహించినవారంతా ఏళ్ల తరబడిగా రాజకీయాల్లో ఉన్నారని, తనతోపాటు ఉద్యమంలోనూ పాల్గొన్నారని గుర్తుచేశారు. వారికి ప్రజాప్రతినిధులుగా అవకాశం దక్కడంతో సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రజోపయోగ కార్యక్రమాలకు తన సహకారం కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజాప్రతినిధులుగా మళ్లీ ఎంపిక కావాలని ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లాను అన్నింటా ముందంజలో నిలిపిన ప్రజాప్రతినిధులకు, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్



జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

వీడలేక.. వీడిపోతూ..

ముగిసిన చివరి జడ్పీ సమావేశం

- ఉద్వేగానికి లోనైన జడ్పీటీసీలు, ఎంపీపీలు
- ఐదేళ్ల జ్ఞాపకాలను నెమరువేసుకున్న సభ్యులు
- ప్రజా జీవితంలో ఉండాలి: మంత్రి పొన్నం
- పదవులు తాత్కాలికం.. ప్రజాసేవే శాశ్వతం : హరీశ్‌రావు
- సభ్యుల సహకారాన్ని మరువను : జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



టీచర్‌ను.. చైర్‌పర్సనయ్యా - రోజాశర్మ

ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగానే ఉద్యోగ విరమణ పొందుతానని అనుకున్నా.. కానీ తొలి జిల్లాపరిషత్ చైర్‌పర్సన్‌గా గొప్ప అవకాశం దక్కిందని వేలేటి రోజా రాధాకృష్ణశర్మ ఉద్వేగానికి లోనయ్యారు. మాజీ సీఎంకేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, తన భర్త రాధాకృష్ణశర్మకృషితోనే ఐదేళ్లపాటు సగర్వంగా విధులు నిర్వహించానని ఆమె తెలిపారు. ఇతర జిల్లాలు ఈర్షపడేలా సిద్దిపేట జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందన్నారు. జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు తనను ఒక కుటుంబ సభ్యురాలిగా భావించి సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలతీతంగా సమన్వయం చేసుకుంటూ, అధికారులను భాగస్వామ్యం చేస్తూ ప్రశాంతంగా సమావేశాలను నిర్వహించామని వివరించారు.



సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు

ఆంధ్రజ్యోతిప్రతినిధి, సిద్దిపేట/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 27: ఐదేళ్ల పాటు ప్రజాప్రతినిధులుగా పెనవేసుకున్న అనుబంధం వారిని ఒక కుటుంబంలా మార్చింది. సభలు, సమావేశాల్లో ఆత్మీయంగా మెదులుతూ.. ఆలోచనలు పంచుకుంటూ మమేకమయ్యారు. చూస్తుండగానే ఐదు సంవత్సరాల పదవీకాలం గడిచిపోవడం వారిని ఉద్వేగానికి గురిచేసింది. ఈ ఘట్టం గురువారం జరిగిన సిద్దిపేట జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశంలో ఆవిష్కృతమైంది. జడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా ఇన్నాళ్లు కలిసిమెలిసిన అనుభూతులను నెమరువేసుకుంటూ వీడలేక వీడిపోయారు. జూలై4న వీరి పదవీకాలం ముగుస్తుండడంతో వీడ్కోలు స్వీకరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, రఘోత్తమరెడ్డి, కలెక్టర్ మనూ చౌదరి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరై సభ్యులను సన్మానించారు.



జడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన అధికారులు, ఎంపీపీలు



మంత్రికి స్వాగతం పలుకుతూ..

సభలో ఉద్వేగ వాతావరణం

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభం నుంచి ముగిసేదాకా ఉద్వేగ వాతావరణం నెలకొంది. గడిచిన ఐదేళ్లలో 20 సమావేశాలు జరగగా తాజాగా 21వ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఆరు శాఖలపై సమీక్ష నిర్వహించగా.. ఆ తర్వాత జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, వైస్ చైర్మన్ రాజిరెడ్డి, ఇతర జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పలువురు మహిళా ప్రజాప్రతినిధులు ఉద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. ఐదేళ్లపాటు ఒక కుటుంబంలా కలిసి ఉన్నామని, వీడిపోతున్నామంటేనే గుండెలు బరువెక్కుతున్నాయని బాధపడ్డారు. సభ్యులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం అతిథులతో కలిసి ఫొటోలు దిగారు. జిల్లా పరిషత్ తరఫున సన్మానంతోపాటు జ్ఞాపికలు అందించారు. సమావేశం ముగిసినప్పటికీ జడ్పీటీసీలు, ఎంపీపీలు మాత్రం ఒకరినొకరు వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయారు.

శాఖల సమీక్షలో హరీశ్ ఆగ్రహం

- జడ్పీ సర్వసభ్య సమావేశంలో విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ, విద్యుత్‌శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ఇతర జిల్లాల్లో పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు పూర్తిస్థాయిలో వచ్చాయని, సిద్దిపేట జిల్లాపై చిన్న చూపెందుకని డీఈవోను ప్రశ్నించారు.
- సిద్దిపేటలో విద్యుత్ బకాయిలు ఎక్కువగా ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రస్తావించడంపై హరీశ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. బకాయిదారులుగా సిద్దిపేట ప్రజలను అవమానిస్తున్నారని, అసలు చెల్లించాల్సిన బకాయిలు ఎంత అని ఆ శాఖ అధికారులను అడిగారు. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తేనే జీరో బిల్లు ఇవ్వడం విడ్డూరంగా ఉందని, 201 యూనిట్లు వినియోగిస్తే మొత్తం బిల్లు కట్టడం న్యాయమేనా అని అడిగారు. తన నియోజకవర్గంలోని పెద్ద లింగారెడ్డిపల్లిలో మూడు రోజులుగా విద్యుత్ లేదని, గ్రామస్థులు తనకు తెల్లవారుజామున 4 గంటలకు ఫోన్ చేశారని గుర్తుచేశారు.
- మే, జూన్ నెలలకు సంబంధించిన పెన్షన్ డబ్బును ఇంకెప్పుడిస్తారో చెప్పాలని డీఆర్‌డీఏ అధికారులను ప్రశ్నించారు.
- పంచాయతీ సఫాయి కార్మికులకు 7 నెలలుగా జీతాలు రావడం లేదని, రెక్కాడితే గాని డొక్కాడని కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రస్తావించారు. ఈ విషయంపై డీపీవో దేవకిదేవిని వివరణ అడిగారు. ఒక్క రూపాయైనా ఈప్రభుత్వంలో వచ్చిందా? అని ప్రశ్నించారు.
- పంచాయతీరాజ్ శాఖ సమీక్షిస్తూ గత ప్రభుత్వంలో మంజూరైన రహదారులను ఎందుకు రద్దు చేశారని అడిగారు. ఈ రహదారులపై ప్రభుత్వానికి నివేదించాలని సూచించారు.
- గత ప్రభుత్వంలో ఏర్పాటైన సఖి సెంటర్, బాలరక్షక భవన్, భరోసా సెంటర్లను పట్టించుకోవడం లేదని, అందులో పనిచేసే వాళ్లకు జీతాలు ఇవ్వకుంటే వారు పిల్లలకు, మహిళలకు ఎలా సేవ చేస్తారని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులను హరీశ్ ప్రశ్నించారు.
- శాఖల పరంగా తలెత్తుతున్న ఇబ్బందులు, నిధుల విడుదలపై ప్రభుత్వానికి నివేదించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరిని హరీశ్‌రావు కోరారు.

నిద్రలోనే నిండు ప్రాణం బలి

- డ్రైవర్ అజాగ్రత్త..
- అలసటతో నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి వెళ్లిన ఎక్స్‌కవేటర్

చేర్యాల, జూన్ 27 : అలసటతో సేదతీరడానికి చెట్టు నీడలో నిద్రించిన ఓ వ్యక్తి నిండు ప్రాణాన్ని ఎక్స్‌కవేటర్ డ్రైవర్ నిర్లక్ష్యం బలిగొంది. బతుకుదెరువుకోసం ఊరుగాని ఊరు వచ్చిన కూలీని ఎక్స్‌కవేటర్ రూపంలో మృత్యువు కబళించింది. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన పలువురు కూలీలు పొట్టకూటి కోసం రెండు నెలల క్రితం చేర్యాల మండలం అర్జునపట్లకు వచ్చారు. గ్రామంలోని సింప్లీ ఫ్రెష్ కంపెనీలో కూలి పనులను చేస్తున్నారు. వీరంతా కంపెనీ సమీపంలోని ప్రదేశంలో తాత్కాలికషెడ్‌లో తలదాచుకుంటున్నారు. వారికి వంట వండిపెట్టడం కోసం తమ గ్రామానికి చెందిన బంధువులు గోపాల్ సర్దార్, సని సర్దార్‌లను పిలిపించుకున్నారు. వీరిరువురు 15 మందికి నిత్యం వంట తయారుచేస్తున్నందుకు ఒక్కొక్కరికి రూ.12 వేలు వేతనం ఇస్తున్నారు. ఈక్రమంలో గురువారం వంటపనులు ముగించుకున్న గోపాల్ సర్దార్(49) ఒంటినొప్పులతో బాధపడుతూ తమ ప్రదేశానికి సమీపంలోని చెరువు కట్ట ఆవరణలోని చెట్టు నీడన నిద్రించి తనవంటిపై థర్మకోల్ షీట్ కప్పుకున్నాడు. టీఎస్05 ఎఫ్‌జీ9898నంబరు గల ఎక్స్‌కవేటర్‌ను డ్రైవర్ ఎండి.నసీమ్ అతడిని గమనించకుండా అజాగ్రత్తగా నడుపుకుంటూ గోపాల్‌సర్దార్‌పై నుంచి నడిపించడంతో దుర్మరణం చెందాడు. గమనించిన చుట్టుపక్కల వారు కూలీలకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టారు. స్థానిక మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి


- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ

సిద్దిపేట క్రైం, జూన్ 27 : సిద్దిపేటను గంజాయిరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా పోలీసు అధికారులకు సీపీ అనురాధ సూచించారు. గురువారం కమిషనర్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో పెండింగ్ కేసులపై ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. లోక్‌సభ, ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినందుకు పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. పెండింగ్ ఉన్న దొంగతనాల కేసులను టెక్నాలజీతో అన్ని కోణాలలో పరిశోధన చేసి ఛేదించాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతీ దరఖాస్తుపై ఎలాంటి జాప్యం లేకుండా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. ప్రజలకు సత్వరం న్యాయం చేయడానికి అధికారులు సిబ్బంది పోలీస్‌స్టేషన్‌లో అందుబాటులో ఉండాలని సీపీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న డ్రంకెన్ డ్రైవ్ కేసులను త్వరగా పరిష్కరించాలని పేర్కొన్నారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, సామాజిక రుగ్మతలపై కాలేజీ, స్కూళ్లలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీపీ అనురాధ సూచించారు. డయల్ 100కు కాల్ రాగానే వెంటనే స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టాలన్నారు. ఇందులో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆమె హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసి బాధితులకు తప్పకుండా రసీదు ఇవ్వాలని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నీతినిజాయితీగా విధులు నిర్వర్తించి పోలీస్‌శాఖకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించే వారిపై శాఖాపరమైన చర్య లు తప్పవని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా మాట్లాడాలని సీపీ సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ యస్.మల్లారెడ్డి, ఏసీపీలు మధు, పురుషోత్తంరెడ్డి, సతీష్, శ్రీనివాస్, రవీందర్, సుమన్ కుమార్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

గజ్వేల్ పట్టణంలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీ



నిలిచిన మల్లన్నసాగర్ రిజిస్ట్రేషన్లు

- ఎన్నికల కారణంగా మూడు నెలలు నిలిపివేత
- ఆ తర్వాత పట్టించుకోని అధికారులు
- ఉపాధి లేక రావాల్సిన ప్యాకేజీ, పరిహారం అందక భూనిర్వాసితులకు తప్పని అవస్థలు

గజ్వేల్, జూన్ 27: మల్లన్నసాగర్‌లో భూములు కోల్పోయిన భూనిర్వాసితులకు కేటాయించే ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మూడు నెలలుగా నిలిచిపోయింది. ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్లను నిలిపివేసిన అధికారులు ఎన్నికల కోడ్ ముగిసినా రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించలేదు. దీంతో భూములు, సర్వం కోల్పోయిన నిర్వాసితులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎంత తిరిగినా అధికారులు స్పందించకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం సైతం భూనిర్వాసితులకు సంబంధించిన నష్టపరిహారం, ఇతర ప్యాకేజీలకు సంబంధించిన నిధులు విడుదల చేయకపోవడంతో అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు తోడు ఇటీవల రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్ల విషయమై అధికారులకు, కాంగ్రెస్ నాయకులకు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగిన నేపథ్యంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిసింది.

దృష్టిసారించని అధికారులు

మల్లన్నసాగర్ నిర్వాసితులకు న్యాయం చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం కూడా తమను పట్టించుకోవడం లేదని నిర్వాసితులు ఆవేదన చెందుతున్నారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కనీసం మల్లన్నసాగర్ భూనిర్వాసితుల సమస్యను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నిర్వాసితుల సమస్యలు ఎటూ తేల్చకుండా అధికారులు నాన్చివేత ధోరణిని అవలంభిస్తున్నారు. భూనిర్వాసితుల సమస్యలు తీరాలంటే దాదాపుగా రూ.100కోట్ల వరకు అవసరముంటాయని అధికారులు అంచనా వేసినప్పటికీ వాటి విడుదల కావాల్సిన చర్యలు చేపట్టకపోవడంతో అటు ఉపాధి లేక ఇటు రావాల్సిన ప్యాకేజీ, పరిహారం రాక అనేక మంది భూనిర్వాసితులు ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్యాకేజీలు, ప్లాట్ల కేటాయింపులో లబ్ధిదారులు కొందరు మృతిచెందారు. కానీ ప్రభుత్వం మాత్రం స్పందించడం లేదు.

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభిస్తేనే మేలు

మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు కేటాయించే ప్లాట్ల కేటాయింపు ప్రక్రియకు సంబంధించి భూములు అందుబాటులో ఉన్నప్పటికీ అధికారుల ఉదాసీనత వల్ల భూనిర్వాసితులు ఇబ్బందుల పాలవుతున్నారు. ప్యాకేజీలకు సంబంధించి నిధులు విడుదల అయినప్పుడే ఇచ్చే వీలుండగా, కనీసం ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేస్తే తాము ఇళ్లు కట్టుకోవడమో, లేదా ప్లాట్లను విక్రయించుకుని పెళ్లిళ్లు, ఇతరత్రా పనులకు ఉపయోగపడతాయని భూనిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం ఈ విషయంపై చొరవ చూపకపోవడంతో రిజిస్ట్రేషన్లు, ప్యాకేజీలు నిలిచి, ఉపాధి కరువై బిక్కుముఖం వేసుకుని భూనిర్వాసితులు తమలో తామే కుమిలిపోతున్నారు. అధికార యంత్రాంగం స్పందించి ప్లాట్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభించడంతో పాటు ప్యాకేజీ, ఇతరత్రా పరిహారాల గూర్చి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, ప్రభుత్వం సైతం స్పందించాలని భూనిర్వాసితులు కోరుకుంటున్నారు.

చేర్యాల మునిసిపల్‌లో 'చెత్త కష్టాలు'

చేర్యాల, జూన్ 27 : చివరి మజిలీ ఇక్కట్లు తొలగించడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారీకి చేర్యాల మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణ శివారులో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డు, వైకుంఠధామం పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి యేళ్లు గడుస్తున్నా మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో అతీగతీ లేకుండాపోయాయి.
చేర్యాల పట్టణంలో 20వేలకు పైగా జనాభా ఉండగా పలు సామాజికవర్గాల వారు స్వతహాగా శ్మశానవాటికలు ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన వారు స్థానిక పెద్దచెరువు ఆవరణలోని మార్చురీగది సమీపంలో అంత్యక్రియలు నిర్వహించేవారు. అయితే కనీస మౌలిక వసతులు లేక, చెరువులో గోదావరి జలాలను నింపుతుండటంతో అంత్యక్రియలను నిలిపివేశారు. పట్టణ ప్రజల ప్రయోజనం నిమిత్తం స్థానిక పెద్దమ్మగడ్డ శివారులోని ప్రభుత్వ స్థలంలో రూ.కోటిపైగా నిధులతో వైకుంఠధామం, డంపింగ్‌యార్డు పనులు చేపట్టారు. యేళ్లు గడుస్తున్నా పూర్తి చేయలేదు. బర్నింగ్ ప్లాట్‌ఫాంల కోసం పిల్లర్లు నిర్మాణ దశలో ఉండగా, బేస్‌మెంట్ నిర్మాణం పగుళ్లు పడుతున్నాయి. కొంతమేర బిల్లులు చెల్లించినప్పటికీ మిగతా బిల్లులు రావేమోనని కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. డంపింగ్‌యార్డు పనులు చేపట్టినప్పటికీ కేవలం రేకులషెడ్డుకే పరిమితమైంది. తడి, పొడి చెత్తను వేరుచేయడానికి వీలుగా ప్లాట్‌ఫాంల నిర్మాణం చేపట్టనేలేదు. కొందరు చెత్తను తగులబెడుతున్నారు. దీంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లులు రావేమోనని కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు

- శ్రీకాంత్, ఏఈ

వైకుంఠధామం నిర్మాణానికి రూ.కోటి మంజూరు కావడంతో పనులు ప్రారంభమయ్యాయి. రూ.28లక్షల మేర చెల్లింపులు జరిగాయి. మరో రూ.15లక్షలు పెండింగ్‌లో ఉండటంతో బిల్లులు రావేమోనని కాంట్రాక్టర్ అర్థాంతరంగా నిలిపివేశాడు. త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.



ఆగిపోయిన వైకుంఠధామం పనులు



రేకులషెడ్డుకే పరిమితమైన డంపింగ్‌యార్డు

విద్యుత్ సమస్య తీరేదెన్నడు!?

- కుకునూరుపల్లి మండల కేంద్రాన్ని వేధిస్తున్న సమస్య
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, వ్యాపారులు
- సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

8లో





కాలుష్య వ్యర్థాలు

ఎక్కడి నుంచి వచ్చాయి?

పెద్దచెరువులో పది టన్నుల చేపల మృతితో మత్స్యకారుల ఆగ్రహం

- రూ.కోటి వరకు నష్టం వాటిల్లడంతో ఆవేదన
- పీసీబీ అధికారులపై మండిపాటు
- మహేశ్వరం మెడికల్ కళాశాలపై విచారణ చేపట్టాలన్న గంగపుత్రులు

పటాన్‌చెరు రూరల్, జూన్ 27 : చిట్కుల్ గ్రామం పెద్దచెరువులో బుధవారం పెద్దఎత్తున చేపల మృత్యువాత పడడంతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి కాలుష్య వ్యర్థాలు ఎక్కడి నుంచి వచ్చాయో ఇంతవరకు అధికారులు కనిపెట్టలేకపోయారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది టన్నుల మేర చేపలు మృతిచెందితే విచారణ వేగవంతం చేయాల్సిన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), మత్స్యశాఖ అధికారులు కేవలం నీటి నమూనాలను సేకరించి నివేదిక ఇస్తామని చెప్పి వెళ్లిపోవడంపై మండిపడుతున్నారు. రూ.కోటి మేర నష్టం వాటిల్లడంతో గంగపుత్రులు లబోదిబోమంటున్నారు. పాశమైలారం పారిశ్రామిక వాడ నుంచి పెద్దచెరువులోకి వ్యర్థాలు విడుదల చేస్తున్న పరిశ్రమల యాజమాన్యాలకు పీసీబీ అధికారులు అండగా ఉంటున్నారన్న అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

నివేదిక కోసం ఎదురుచూపులు

పీసీబీ, మత్స్యశాఖ అధికారులు విచారణ చేపట్టి నీటి నమూనాలను సేకరించటంతో మత్స్యకారులంతా ఈ నివేదిక కోసం ఎదురుచూస్తున్నారు. చిత్తశుద్ధితో విచారణ చేసి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టకుంటే తాము ఎంతటి ఉద్యమానికైనా సిద్ధమని హెచ్చరిస్తున్నారు. పెద్దచెరువు సమీపంలోనే ఉన్న ప్రైవేటు మెడికల్ కళాశాల వ్యర్థాలు చెరువులో కలవటం వల్లే చేపలు మృతి చెంది ఉండవచ్చని పలువురు మత్స్యకారులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మెడికల్ కళాశాల నుంచి వస్తున్న వ్యర్థాలు ఎక్కడ నిర్వీర్యం చేస్తున్నారో ఇంతవరకు పీసీబీ అధికారులకు కూడా తెలియదని, దీనిపై ఎందుకు దృష్టి సారించడం లేదని ప్రశ్నిస్తున్నారు. స్థానిక మత్స్యకారులు పెద్ద ఎత్తున నష్టపోవడంతో చలించిన కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ మత్స్యకారులను ఆర్థికంగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. చేపల మృతికి కారణాలను అధికారులు విచారణ చేపట్టారని, అవసరమైతే సంబంధిత మంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.



చిట్కుల్ పెద్దచెరువులో తేలుతున్న చేపలు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించం

- గంజాయి సాగు చేయడం, విక్రయించడం నేరం
- సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ రూపేష్

నారాయణఖేడ్, జూన్ 27: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. నారాయణఖేడ్ సబ్ డివిజన్ కార్యాలయంలో గురువారం నేరాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గతంలో గంజాయి సాగు, అక్రమ రవాణ చేసిన కేసుల నిందితులకు ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. గంజాయిని సాగు చేయడం, విక్రయించడం, వారికి సహకరించడం నేరమన్నారు. వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామన్నారు. ఎక్కడైన గంజాయి సాగు, విక్రయాలు చేసినట్లయితే తమకు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడానికి కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఖేడ్, కంగ్టి సీఐలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎండు గంజాయి స్వాధీనం.. ఒకరి అరెస్ట్

సంగారెడ్డి క్రైం, జూన్ 27 : ఎండు గంజాయిని తరలిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండలం పాశమైలారం వద్ద గురువారం ఉదయం వాహనాల తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌కుమార్‌సింగ్ పాశమైలారంలో నివసిస్తుండగా తన బైక్‌పై ఎండు గంజాయి రవాణా చేస్తూ పట్టుబడినట్లు పేర్కొన్నారు. 350 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ సీహెచ్.చంద్రశేఖర్, ఎస్ఐ బి.యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ ఎండీ అలీమ్, కానిస్టేబుళ్లు ఎం.గోపాల్, రామారావు, సతీష్, ఖరీమ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ ఆఫీసర్ ఉద్యోగం సాధించిన మల్లంపల్లి యువతి



కొలిపాక యామిని

అక్కన్నపేట, జూన్ 27 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్రికల్చరల్ ఆఫీసర్ పరీక్ష ఫలితాలు బుధవారం రాత్రి ప్రకటించారు. ఇందులో రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంకు సాధించి అక్కన్నపేట మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన కొలిపాక యామిని అగ్రికల్చర్ ఆఫీసర్‌గా ఎంపికైంది. తండ్రి కొలిపాక వెంకటమల్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా, తల్లి రజిత గృహిణి. యామిని ఎస్ఎస్‌సీ వరకు హుస్నాబాద్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్లో, ఇంటర్ ఎస్ఆర్ కాలేజ్ హన్మకొండలో, బీఎస్సీ అగ్రికల్చర్, ఎంఎస్సీ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో అభ్యసించారు. ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

నాచగిరి క్షేత్రానికి వేలం ద్వారా రూ.17.95 లక్షల ఆదాయం

వర్గల్, జూన్ 27 : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో గురువారం నిర్వహించిన వేలం పాటలో రూ.17,95,000 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి మెదక్ జిల్లా సహాయ కమిషనర్ శివరాజ్ పర్యవేక్షణలో వివిధ రకాల వస్తువులు, సామగ్రిపై టెంటర్, ఓపెన్ వేలం నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి వివరాలను తెలియజేశారు. టెంట్ సామగ్రికి హైదరాబాద్ ధర్మశాస్త్ర ఎంటర్‌ప్రైజెస్ వారికి రూ.8.50 లక్షలు, తలనీలాలు రూ.4.30 లక్షలు, దోతులు, చీరలు పోగు చేసుకునట రూ.3.90 లక్షలకు, పాదరక్షలు భద్రపరుచుట రూ.1.25లక్షలు పలికాయి. గత సంవత్సరం వేలం ద్వారా రూ.15.66లక్షలు రాగా, ఈ ఏడాది రూ.2.29 లక్షల అదనంగా వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు.

నేడు మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం

చేర్యాల, జూన్ 27 : కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నేడు సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నారు. మల్లన్న, ఎల్లమ్మ ఆలయ ఆవరణలో కొబ్బరికాయల విక్రయం, భక్తులు మొక్కుబడులుగా సమర్పించిన తలనీలాలు, మొక్కుబడి శేషవస్త్రాలు, పసుపు, ఒడిబియ్యం, కొబ్బరి ముక్కల సేకరణతో పాటు ఆలయానికి పాలు, పూలు, కూరగాయల సరఫరాతో పాటు టాయిలెట్ బ్లాక్‌ల లీజుకు వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఈవో బాలాజీ తెలిపారు. ఇటీవల పలువురు దరఖాస్తు చేసుకోగా, షెడ్యూల్ జారీ చేశామని, నేడు దేవాదాయశాఖ అధికారి సమక్షంలో వేలం పాటలు జరపనున్నామని పేర్కొన్నారు.



కిక్ బాక్సింగ్ చాంపియన్‌గా హోంగార్డు కుమారుడు

- అభినందించిన సంగారెడ్డి ఎస్పీ రూపేష్



రఘువంశీని అభినందిస్తున్న ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, జూన్ 27 : ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన సంగారెడ్డికి చెందిన హోంగార్డ్ ముత్యం కుమారుడు రఘువంశీని గురువారం సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. పూణేలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా కిక్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో రఘువంశీ చాంపియన్‌గా నిలిచాడు. ఈ టోర్నమెంట్‌లో 27 రాష్ట్రాలకు చెందిన బాక్సర్లు పోటీపడగా రఘువంశీ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. రఘువంశీ సంగారెడ్డి పట్టణంలోని అక్షర పాఠశాలలో 6వ తరగతి చదువుతూ, స్థానిక వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో మాస్టర్ పోచయ్య వద్ద రెండేళ్లుగా శిక్షణ తీసుకుంటున్నారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని, అందుకు తగిన అభ్యాసన చేయాలని ఎస్పీ సూచించారు.

జంతర్ మంతర్ వద్ద ఆందోళనలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్



ఢిల్లీలో ఆందోళనలో పాల్గొన్న శ్రీనివాస్

నారాయణఖేడ్, జూన్ 27 : నీట్ పరీక్షా పేపర్ లీక్‌ను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ నిరసనలో యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉదయ్‌శంకర్ పటేల్, నారాయణఖేడ్ అసెంబ్లీ అధ్యక్షులు, టీపీసీసీ సభ్యుడు కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీపై చర్యలు తీసుకోవాలి

- సీపీకి హిందూ వాహిని నాయకుల వినతి

సిద్దిపేట క్రైం, జూన్ 27 : ఎంపీ అసదుద్దీన్ ఓవైసీపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సిద్దిపేట జిల్లా హిందూ వాహిని ఆధ్వర్యంలో సిద్దిపేట పోలిస్ కమిషన్ డాక్టర్ బి.అనురాధకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ వాహిని కార్యకర్తలు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అసదుద్దీన్ ఓవైసీ తన ప్రమాణ స్వీకారం సందర్భంగా చేసిన 'జై పాలస్తీనా' నినాదం దేశ సమగ్రతను, ఐక్యతను దెబ్బతీసే విధంగా ఉందని అతనిపై చర్య తీసుకోవాలని కోరారు.

మహిళ కడుపులోని 10 కిలోల తిత్తి తొలగింపు

రామచంద్రాపురం, జూన్ 27 : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలోని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు ఓ మహిళ(40)కు ఓపెన్ సర్జరీ చేసి 10 కిలోల బరువు, 17/16/11 సెంటీమీటర్ల పరిమాణం గల తిత్తిని తొలగించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీనియర్ గైనకాలిస్ట్ డాక్టర్ మిథున, వైద్య బృందం సభ్యులు గురువారం విలేకరులకు వివరించారు. సోమవారం ఓ మహిళ కడుపునొప్పితో మెడికవర్ ఆసుపత్రిలో చేరారు. సదరు మహిళకు వైద్య పరీక్షలు నిర్వహించగా పొత్తి కడుపులో కణతి ఉన్నట్టు గుర్తించారు. ఇది పొత్తి నుంచి బొడ్డు వరకు ఉన్నది. టోటో పద్ధతి శస్త్ర చికిత్స చేపట్టి తొలగించారు. తమ ఆసుపత్రిలో ఇప్పటి వరకు 15 సెంటీమీటర్ల తిత్తిని మాత్రమే తొలగించగా, ఇది అతిపెద్ద తిత్తి అని వైద్యురాలు మిథున పేర్కొన్నారు. ఇలాంటివి రుతుస్రావం నిలిచిన మహిళలు, బాలికల్లో కనిపిస్తాయన్నారు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే కాన్సర్ వచ్చే అవకాశాలుంటాయని హెచ్చరించారు.

సెన్సెక్స్ 79,000 పైకి..
24,000 స్థాయికి నిఫ్టీ

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- నాలుగో రోజూ లాభాల బాటలో మార్కెట్
- రూ.438.41 లక్షల కోట్లకు మదుపరుల సంపద

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో గురువారం రికార్డుల మోత మోగింది. వరుసగా నాలుగో రోజూ ర్యాలీ తీసిన ప్రామాణిక సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సెన్సెక్స్ తొలిసారిగా 79,000 మైలురాయిని చేరగా.. నిఫ్టీ 24,000 మార్క్‌ను దాటింది. మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో పాటు ఐటీ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను మరింత ముందుకు నడిపించాయి. సెన్సెక్స్ ఒక దశలో 721.78 పాయింట్లు ఎగబాకి 79,396.03 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. ట్రేడింగ్ నిలిచేసరికి, సూచీ 568.93 పాయింట్ల లాభంతో 79,243.18 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఒక దశలో 218.65 పాయింట్ల వృద్ధితో 24,087.45 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 175.70 పాయింట్ల లాభంతో 24,044.50 వద్ద కొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది.

ఈ మంగళవారం 78,000 స్థాయికి చేరిన సెన్సెక్స్.. కేవలం రెండు ట్రేడింగ్ సెషన్లలోనే మరో 1,000 పాయింట్ల మేర పుంజుకుంది. గత నెల 24న తొలిసారిగా 23,000 మైలురాయిని తాకిన నిఫ్టీ, కేవలం 23 ట్రేడింగ్ సెషన్లలో మరో 1,000 పాయింట్లు వృద్ధిని కనబరిచింది. మార్కెట్ జైత్రయాత్రలో ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం సరికొత్త జీవిత కాల గరిష్ఠ స్థాయి రూ.438.41 లక్షల కోట్లకు (5.25 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. గడిచిన నాలుగు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2,033.28 పాయింట్లు (2.63 శాతం) పుంజుకోగా.. మార్కెట్ సంపద రూ.3.93 లక్షల కోట్లు పెరిగింది.

వచ్చే నెల 3 నుంచి ఎమ్‌క్యూర్ ఫార్మా ఐపీఓ

అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బెయిన్ క్యాపిటల్ పెట్టుబడులు కలిగిన ఎమ్‌క్యూర్ ఫార్మా తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చేనెల 3న ప్రారంభమై 5న ముగియనుంది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.800 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 1.14 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిన విక్రయించనుంది. వచ్చేనెల 10న కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే అవకాశం ఉంది.

జేపీ మోర్గాన్ బాండ్ ఇండెక్స్‌లోకి భారత ప్రభుత్వ సెక్యూరిటీలు

భారత ప్రభుత్వ బాండ్లు (జీ-సెక్) శుక్రవారం నుంచి జేపీ మోర్గాన్-ఎమర్జింగ్ మార్కెట్ బాండ్ ఇండెక్స్‌లో భాగం కానున్నాయి. వచ్చే 10 నెలల (2024 జూన్ 28 నుంచి 2025 మార్చి 31) కాలంలో ఈ సూచీలో చేరనున్నాయి. నెలకు ఒక శాతం చొప్పున పది నెలల్లో గరిష్ఠంగా సూచీలో 10 శాతం వెయిటేజీ వరకు భారత జీ-సెక్‌లను సూచీలో చేర్చనున్నారు. తద్వారా వచ్చే పది నెలల్లో మన ప్రభుత్వ బాండ్లలోకి కనీసం 2,000-2,500 కోట్ల డాలర్ల మేర విదేశీ పెట్టుబడులు రావచ్చని అంచనా. దాంతో మన జీ-సెక్‌ల రేట్లు తగ్గడంతో ప్రభుత్వానికి రుణ సమీకరణ వ్యయం కూడా తగ్గనుందని విశ్లేషకులు పేర్కొన్నారు.

ఇండియా సిమెంట్స్‌లో అల్ట్రాటెక్ పాగా

రూ.1,900 కోట్లతో 23% వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: దేశీయ సిమెంట్ రంగంలో కన్సాలిడేషన్ కొనసాగుతోంది. తాజాగా ఆదిత్య బిర్లా గ్రూప్ కంపెనీ అల్ట్రాటెక్ సిమెంట్.. చెన్నై కేంద్రంగా ఉన్న ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 22.77 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకోసం రూ.1,889.27 కోట్లు చెల్లించింది. డీమార్ట్ ప్రమోటర్ రాధాకృష్ణ దమానీ, ఆయన కుటుంబ సభ్యుల నుంచి అల్ట్రాటెక్ 2 బ్లాక్ డీల్స్ ద్వారా ఈ వాటాలు కొనుగోలు చేసింది. ఇందుకోసం మొదటి బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.265 చొప్పున, రెండో బ్లాక్ డీల్‌లో ఒక్కో షేరుకు రూ.285 చొప్పున చెల్లించింది.

ముందు చూపుతోనే: ఇది కేవలం పెట్టుబడి లాభాల కోసం జరిపిన కొనుగోలు అని అల్ట్రాటెక్ చెబుతోంది. అయితే ఇప్పటికే నష్టాల్లో ఉన్న ఇండియా సిమెంట్స్‌ని ఎలాగైనా కైవసం చేసుకునే వ్యూహంతోనే అల్ట్రాటెక్.. ఇండియా సిమెంట్స్ ఈక్విటీలో 23 శాతం వాటా కొనుగోలు చేసిందని భావిస్తున్నారు. గతంలో బీవీ రాజు నిర్వహణలోని రాశి సిమెంట్, విష్ణు సిమెంట్ టేకోవర్ కోసం గతంలో ఇండియా సిమెంట్స్ కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. ముందు పెట్టుబడి లాభాల కోసమే అంటూ, ఈ రెండు కంపెనీల ఈక్విటీలో కొంత వాటా కొనుగోలు చేసింది. తర్వాత బీవీ రాజు బంధువుల నుంచి మరింత వాటా కొనుగోలు చేసి ఈ రెండు సంస్థలను కైవసం చేసుకుంది. ఇండియా సిమెంట్ ఈక్విటీలో ఇప్పటికీ ప్రధాన ప్రమోటర్ ఎన్ శ్రీనివాసన్‌కు, ఆయన నిర్వహణలోని ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలకు 28 శాతం వాటా ఉంది. మిగతా 49 శాతం వాటా రిటైల్ మదుపరులు, సంస్థాగత మదుపరుల చేతుల్లో ఉంది.

జియో సేవలు మరింత ప్రియం

27% వరకు టారిఫ్‌ల పెంపు

జూలై 3 నుంచి అమల్లోకి

స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరునాడే వడ్డింపు

జియో బాటలో మిగతా టెల్కోలు!

న్యూఢిల్లీ: టెలికాం రంగంలో టారిఫ్‌ల పెంపు మళ్లీ ప్రారంభమైంది. ముకేశ్ అంబానీ సారథ్యంలోని రిలయన్స్ జియో ఇందుకు నాంది పలికింది. తన ప్లాన్స్‌లోని అన్ని మొబైల్ టారిఫ్స్‌ను 12 నుంచి 27 శాతం వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ పెంపు జూలై 3వ తేదీ నుంచి అమల్లోకి వస్తుంది. రెండున్నర సంవత్సరాల తర్వాత జియో తన మొబైల్ టారిఫ్స్‌ను పెంచడం ఇదే మొదటిసారి. '5జీ, ఏఐ టెక్నాలజీల్లో పెట్టుబడుల ద్వారా స్థిరమైన అభివృద్ధి కోసం టారిఫ్‌లు పెంచుతున్నాం' అని రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్ ఆకాశ్ అంబానీ ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా అన్‌లిమిటెడ్ ఉచిత 5జీ సర్వీసులను కొన్ని ప్లాన్స్‌లోని కస్టమర్లకే కంపెనీ పరిమితం చేసింది. స్పెక్ట్రమ్ వేలం ముగిసిన మరుసటి రోజే రిలయన్స్ జియో టారిఫ్‌లు పెంచడం విశేషం. దీంతో మిగతా టెలికాం కంపెనీలు త్వరలోనే రిలయన్స్ జియోను అనుసరించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

పెంపు ఇలా: ప్రస్తుతం రూ.15గా ఉన్న ఒక జీబీ డేటా యాడ్ ఆన్ ప్యాక్ ధరను రూ.19కు (27 శాతం) పెంచింది. 75 జీబీ పోస్ట్ పెయిడ్ డేటా ప్లాన్ టారిఫ్‌ను రూ.399 నుంచి రూ.449కి పెంచేసింది. ఇక అత్యంత ప్రజాదరణ పొందిన 84 రోజులు చెల్లుబాటయ్యే రూ.666 అన్‌లిమిటెడ్ ప్లాన్ టారిఫ్‌ను రూ.799కి (20 శాతం) పెంచేసింది. ఏడాది పాటు చెల్లుబాటయ్యే వార్షిక పథకాల టారిఫ్‌లనూ రూ.1,559 నుంచి రూ.1,899కి, రూ.2,999 నుంచి రూ.3,599కి పెంచింది. రోజుకి 2 జీబీ లేదా అంతకంటే ఎక్కువ జీబీ ప్లాన్స్‌లో ఉన్న ఖాతాదారులకు అపరిమిత 5జీ డేటా లభిస్తుందని తెలిపింది.



ఉచితంగా రెండు యాప్స్

టారిఫ్‌ల పెంపుతో పాటు తన ఖాతాదారుల కోసం రిలయన్స్ జియో రెండు ప్రత్యేక యాప్స్‌ని అందుబాటులోకి తెచ్చింది. జియో సేఫ్, జియో ట్రాన్స్‌లేట్ అనే ఈ రెండు యాప్స్ ఏడాది పాటు జియో ప్రస్తుత ఖాతాదారులకు ఉచితంగా అందుబాటులో ఉంటాయి. ఇందులో జియో సేఫ్ యాప్ ద్వారా సురక్షితంగా కాల్స్, మెసేజ్‌లు, ఫైల్స్ ట్రాన్స్‌ఫర్‌తో సహా అనేక పనులు చేయవచ్చని తెలిపింది. ఇక కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత జియో ట్రాన్స్‌లేటర్‌యాప్ ద్వారా వాయిస్ కాల్స్, వాయిస్ మెసేజ్‌లు, టెక్స్, ఇమేజ్‌లను వివిధ భాషల్లోకి తర్జుమా చేయవచ్చు. కొత్తగా చేరే ఖాతాదారులు మాత్రం ఈ యాప్స్‌కి నెలకు రూ.99 నుంచి రూ.199 వరకు చెల్లించాలి.

2024-25లో ఫార్మా ఎగుమతుల్లో 10% వృద్ధి

రూ.2.6 లక్షల కోట్లుగా నమోదయ్యే చాన్స్

ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత్ నుంచి 3,100 కోట్ల డాలర్ల (దాదాపు రూ.2.6 లక్షల కోట్లు) ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి కావచ్చని ఫార్మాస్యూటికల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఫార్మా ఎగుమతులు 2,785 కోట్ల డాలర్లు (రూ.2.32 కోట్లు)గా ఉన్నాయని, 2024-25లో ఇవి 10-12 శాతం వరకు వృద్ధిని నమోదు చేసే అవకాశం ఉందని భావిస్తున్నట్లు ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ ఉదయ్ భాస్కర్ వెల్లడించారు. గురువారం నాడిక్కడ ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-మే నెలల కాలంలో ఫార్మా ఎగుమతులు 8.85 శాతం వృద్ధితో 435 కోట్ల డాలర్ల నుంచి 473 కోట్లకు పెరిగాయని తెలిపారు. ఎగుమతులపరంగా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నప్పటికీ నిర్దేశిత ఎగమతుల లక్ష్యాలను చేరుకుంటామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఆఫ్ పేటెంట్ ఔషధాలతో అపార అవకాశాలు

2023 నుంచి 2029 వరకు అంతర్జాతీయంగా 15 బ్లాక్‌బస్టర్ ఔషధాల పేటెంట్ గడువు తీరిపోనుందని, ఈ ఔషధాలతో భారత ఫార్మా పరిశ్రమ అపారమైన అవకాశాలు దక్కించుకునే వీలుందని ఉదయ్ భాస్కర్ తెలిపారు. ఈ ఆఫ్-పేటెంటెడ్ ఔషధాల విలువ దాదాపు 11,200 కోట్ల డాలర్లుగా ఉందని, ఇందులో భారత కంపెనీలు 1,000 కోట్ల డాలర్ల వరకు అవకాశాలను అందుకునే అవకాశం ఉందన్నారు. కాగా ప్రస్తుతం దేశీయ ఫార్మా కంపెనీలు.. అంతర్జాతీయ రెగ్యులేటరీ సంస్థల నుంచి కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయని, చాలా వరకు ఇవి నాణ్యతకు సంబంధించినవిగా ఉంటున్నాయని వివరించారు. అయితే ఈ సమస్యను అధిగమించేందుకు ఫార్మెక్సిల్ ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

నట్టేట ముంచే పెట్టుబడి సలహాదారులకు చెక్!

- సెబీ నియంత్రణలోకి ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్స్
- అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్లకు కొత్త నియమావళి
- డెరివేటివ్స్‌లో స్టాక్స్ ఎంట్రీకి కఠిన నిబంధనలు
- సెబీ బోర్డులో పలు కీలక నిర్ణయాలు



ముంబై: డిజిటల్ మాధ్యమాల ద్వారా ఆర్థిక పెట్టుబడులపై సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్ల (ఫిన్‌ఫ్లుయెన్సర్స్)ను నియంత్రించాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిర్ణయించింది. అన్‌రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్ కోసం నియమావళిని విడుదల చేసింది. అన్ రిజిస్టర్డ్ ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో సెబీ నమోదిత కంపెనీలు, వారి ఏజెంట్లు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా భాగస్వాములు కాకుండా నిషేధం విధించింది. గురువారం సమావేశమైన సెబీ బోర్డు ఈ ప్రతిపాదనను ఆమోదించింది. పక్షపాతంతో, పక్కదోవ పట్టించే సలహాలిచ్చే ఫిన్‌ఫ్లుయెన్సర్స్‌తో ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో నియంత్రణ మండలి తాజా చర్యలు చేపట్టింది. ఎందుకంటే, పెట్టుబడులు, మదుపు కోసం ఫిన్‌ఫ్లుయెన్సర్ల సలహాలపై ఆధారపడే చిన్న మదుపరుల సంఖ్య గడిచిన కొన్నేళ్లలో భారీగా పెరిగింది. సెబీ కొత్త నియమావళి ఫిన్‌ఫ్లుయెన్సర్లను వారిచ్చే సలహాలకు బాధ్యులుగా, జవాబుదారీగా చేయనుంది. అంతేకాదు, సెబీ రిజిస్టర్డ్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ) తమ క్లయింట్ల నుంచి రుసుము వసూలు చేసేందుకు క్లోజ్డ్ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని కూడా నియంత్రణ మండలి నిర్ణయించింది.

అప్పు చేసి ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్: బుచ్

ఏదైనా కంపెనీ షేరును డెరివేటివ్ ట్రేడింగ్‌లో చేర్చడం లేదా వైదొలగడానికి సంబంధించిన అర్హత నిబంధనలను సెబీ కఠినతరం చేసింది. నిత్యం తక్కువ టర్నోవర్ కలిగిన స్టాక్స్‌ను ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) విభాగం నుంచి ఏరివేసేందుకు ఇది దోహదపడనుంది. అంతేకాదు, ఎఫ్ అండ్ ఓ విభాగ ట్రేడింగ్‌పై సమీక్ష జరిపేందుకు సెబీ 15 మంది సభ్యులతో కూడిన నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ మూడు కోణాల్లో (మార్కెట్ అభివృద్ధి, ఇన్వెస్టర్ల సొమ్ముకు రక్షణ, పొంచి ఉన్న ముప్పులు) ఎఫ్ అండ్ ఓ మార్కెట్‌ను సమీక్షించనుందని బోర్డు భేటీ అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ తెలిపారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్ల పాత్ర పెరగడం ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపవచ్చన్నారు. చిన్న ఇన్వెస్టర్లు అప్పు చేసి మరీ ఎఫ్ అండ్ ఓలో ట్రేడింగ్ నెరుపుతున్నారని, కుటుంబ పొదుపు సొమ్మునూ కరిగించేస్తున్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం మంచిది కాదన్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,730 ▼	65,750 ▼	94,500 ▼
ముంబై	71,391 ▲	65,394 ▲	87,043 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

28వ తేదీ

హైదరాబాద్	515	విజయవాడ	520
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	525

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	123
వరంగల్	110	గుంటూరు	123
కరీంనగర్	110	ఒంగోలు	123
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	130
కర్నూలు	110	నెల్లూరు	130
విశాఖపట్నం	129	అనంతపురం	123
గోదావరి	123		

ఢిల్లీలోని ఒవైసీ ఇంటినేమ్ ప్లేట్‌పై సిరా చల్లి పారిపోయిన దుండగులు

» ఒవైసీ మండిపాటు.. అమిత్‌షా చేయిస్తున్నారని ఆరోపణ

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మజ్లిస్ అధ్యక్షుడు, పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఢిల్లీలోని ఇంటి ఆవరణలో ఉన్న నేమ్ ప్లేట్‌పై ఇద్దరు దుండగులు సిరా చల్లి పారిపోయారు. ఈ ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలో రికార్డు అయిన దృశ్యాలను ఎక్స్‌లో పంచుకుంటూ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నిరోధించడంలో ఢిల్లీ పోలీసుల విఫలం అయ్యారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పర్యవేక్షణలోనే ఇవి జరుగుతున్నాయని ఆరోపించారు. ఎంపీలకు తగిన భద్రత ఉంటుందో లేదో స్పష్టం చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ప్రశ్నించారు. ఇంటిపై సిరా చల్లడం, రాళ్లు రువ్వి పారిపోవడం పిరికిపందల చర్య అని, ఇలాంటి వాటికి తాను భయపడనని స్పష్టం చేశారు. ధైర్యం ఉంటే నేరుగా తనను ఎదుర్కోవాలని ఒవైసీ సవాల్ విసిరారు.

బియ్యం ఇచ్చేందుకు.. మిల్లర్లకు మరో 90 రోజుల సమయం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని బియ్యం(సీఎంఆర్) ఇవ్వని మిల్లర్లకు మరో 90 రోజుల పాటు గడువు ఇస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం జీవో జారీ చేశారు. ఈ పొడిగింపు 2019-20, 2020-21 యాసంగి సీజన్, 2021-22 వానాకాలం, యాసంగి, 2022-23 వానాకాలం సీజన్ సీఎంఆర్ బకాయిలకు వర్తిస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన సీఎంఆర్ ధరకు 125 శాతం లేదా 12 శాతం వార్షిక వడ్డీ రేటు.. ఇందులో ఏది ఎక్కువైతే అది నగదు రూపంలోనైనా, బియ్యం రూపంలో(స్టేట్ పూల్‌కు)నైనా రికవరీ చేయవచ్చని పేర్కొన్నారు. గడువులోగా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. మిల్లర్లకు ధాన్యం మిల్లింగ్‌కు అనుమతి ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తామని స్పష్టం చేశారు. పౌర సరఫరాల శాఖ కమిషనర్, అన్ని జిల్లాల మేనేజర్లు, పౌర సరఫరాల సంస్థ అధికారుల సమన్వయంతో ఈ రికవరీ ప్రక్రియను పర్యవేక్షించనున్నారు.

నిబ్రస్ డ్రోన్లకు డీజీసీఏ ఆమోదం

» భూ సర్వే అవసరాలు తీర్చేలా ఆధునిక ఫీచర్లు



హైదరాబాద్ సిటీ, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అధునాతన ఫీచర్లతో భూమి సర్వేకు నిబ్రస్ టెక్నాలజీస్ సంస్థ రూపొందించిన డ్రోన్ సర్వేయాన్ వి1కు డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఆమోద ముద్ర వేసింది. 1.99 కిలోల బరువుండే ఈ డ్రోన్‌కు అధిక తరంగ ధైర్ఘ్యం (హై రెజుల్యూషన్) కలిగిన 23 మెగా పిక్సల్ కెమెరా అమర్చి ఉంటుంది. ఫలితంగా అత్యంత స్పష్టమైన చిత్రాలు, డేటాను సేకరించగలదు. గంటకు 25 కిలోమీటర్ల వేగంతో గాల్లో ఎగరగలదు. వేగంగా విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీ రంగంలో తమ ఉనికి చాటుకునేలా అధునాతన ఉత్పత్తులను రూపొందిస్తున్నట్టు నిబ్రస్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు శుభం బరన్వాల్ తెలిపారు. సర్వే పరిశ్రమలో సర్వేయాన్ వీ1డ్రోన్ విప్లవాత్మక మార్పులకు కారణమవుతుందనే విశ్వాసం వ్యక్తంచేశారు.

ఆడపిల్ల వద్దంటూ.. ఏడో నెలలో అబార్షన్

తల్లి ప్రాణానికే ముప్పని వైద్యులు చెప్పినా వినని భర్త

» ఆర్ఎంపీ సహాయంతో భార్యకు మామిడి తోటలో గర్భస్రావం చేయించి ఆమె ప్రాణాలు బలిగొన్న వైనం

» సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో విషాద ఘటన



సూర్యాపేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు



సుహాసిని (ఫైల్)

హుజూర్‌నగర్ / సూర్యాపేట క్రైం, జూన్ 27: భార్య కడుపులో పెరుగుతున్నది ఆడపిల్ల అని తెలిసి గర్భస్రావం చేయించేందుకు సిద్ధపడ్డాడా భర్త! ఏడో నెలలో అబార్షన్ చేస్తే తల్లిప్రాణాలకే ప్రమాదమని వైద్యులు హెచ్చరించినా అతడి మనసు మారలేదు! తెలిసిన ఆర్ఎంపీ సాయంతో.. ఓ వైద్యుణ్ని సంప్రదించి.. అతడి మామిడితోటలో దొంగచాటుగా అబార్షన్ చేయించాడు. ఈ క్రమంలో తీవ్ర రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయిందా అభాగ్యురాలు!! సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిందీ విషాదం. తమకు తెలియకుండా తమ కుమార్తెకు అల్లుడు ఆపరేషన్ చేయించడాన్ని ఆగ్రహిస్తూ తల్లిదండ్రులు గురువారం సూర్యాపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగుచూసింది. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం వెన్నారం గ్రామపంచాయతీ ఆవాసం రాముతండాకు చెందిన సుహాసిని(26)కి చివ్వెంల మండలం ఎంజీనగర్‌తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్‌తో ఆరేళ్లక్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హరిసింగ్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఏడాదిన్నర కిందట సుహాసిని గర్భవతి కాగా.. లింగనిర్ధారణ పరీక్ష చేయించాడు. ఆమె గర్భంలో ఉన్నది ఆడపిల్ల అని తెలియగానే అబార్షన్ చేయించాడు. ఇటీవల ఆమె మరోసారి గర్భం దాల్చడంతో మళ్లీ స్కానింగ్ తీయించాడు. కడుపులో ఉన్నది ఆడశిశువు అని నిర్ధారణ కావడంతో మరోసారి అబార్షన్ చేయించేందుకు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యురాలు.. ఏడు నెలల గర్భం ఉన్న పరిస్థితుల్లో అబార్షన్ చేయడం వీలుపడదన్నారు. అయినప్పటికీ హరిసింగ్ ఊరుకోలేదు. ఓ ఆర్ఎంపీ సహాయంతో భార్య సుహాసినిని తీసుకుని హుజూర్‌నగర్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. ఆమెకు అబార్షన్ చేసేందుకు ఓ వైద్యుడిని ఒప్పించారు. హుజూర్‌నగర్ పట్టణ సమీపంలో.. ఆ వైద్యుడికి చెందిన మామిడి తోటలో ఉన్న ఆపరేషన్ థియేటర్‌లో ఈ నెల 25వ తేదీన రాత్రిపూట సుహాసినికి అబార్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావమైంది. పరిస్థితి విషమిస్తుండటంతో ఆమెను తొలుత కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు పరిస్థితి బాగాలేదని చెప్పడంతో.. ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడినుంచి తిరిగి సూర్యాపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి ఆమె మృతి చెందింది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపకుండా అదే రోజు మృతదేహాన్ని ఎంజీనగర్‌తండాకు తీసుకెళ్లాడామె భర్త.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..

సుహాసిని మృతి విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఎంజీనగర్ తండాకు వెళ్లారు. తమకు తెలియకుండా తమ కుమార్తెకు ఎలా ఆపరేషన్ చేయిస్తావంటూ అల్లుడితో గొడవపడ్డారు. ఆపరేషన్ చేసిన వైద్యుడిని నిలదీసేందుకు సుహాసిని తల్లిదండ్రులు, బంధువులు హుజూర్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు లేకపోవడంతో సిబ్బందితో గొడవపడ్డారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో సూర్యాపేట పట్టణానికి వచ్చి స్థానిక ఏరియా ఆసుపత్రిలో సుహాసిని మృతదేహాన్ని ఉంచారు. అనంతరం.. సుహాసిని భర్తపైన, ఆపరేషన్ చేసిన వైద్యుడిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులు వారి ఫిర్యాదు తీసుకుని.. బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆ తర్వాత.. చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసిన హుజూర్‌నగర్ వైద్యుడితో పాటు, ముగ్గురు ఆర్ఎంపీలు, ఆసుపత్రి అటెండర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

'శ్రీశైలం'లో యూనిట్-4కు మరమ్మతులు!

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జెన్‌కో చర్యలు

త్వరలో టెండర్లు నిర్వహించేందుకు కసరత్తు

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రంలోని 4వ యూనిట్‌కు మరమ్మతులు చేపట్టేందుకు జెన్‌కో చర్యలు చేపట్టింది. శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో 150 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన 6 యూనిట్లు ఉన్నాయి. 2020 ఆగస్టు 20న జలవిద్యుత్ కేంద్రంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకోగా.. తొమ్మిది మంది మృత్యువాత పడ్డారు. ప్రమాదంలో కొన్ని యూనిట్లు పూర్తిగా, మరికొన్ని యూనిట్లు పాక్షికంగా కాలిపోయాయి. 4వ యూనిట్‌కే అత్యధిక నష్టం వాటిల్లింది. దీనికి జర్మనీ కంపెనీ వైత్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేశారు. గత ఏడాది జూలైలో 80 గంటలపాటు విద్యుదుత్పత్తి చేసిన తర్వాత ఫాల్ట్ రావడంతో 4వ యూనిట్ మళ్లీ కాలిపోయింది. డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్‌లోనే కాలిపోయినందున ఒప్పందం ప్రకారం సొంత ఖర్చుతో మరమ్మతు చేయాలని 'వైత్' గ్రూపును జెన్‌కో కోరగా, ఆ సంస్థ నిరాకరించింది. 4వ యూనిట్‌కు ఇతర మరమ్మతులు నిర్వహించడం వల్లే ఫాల్ట్ ఏర్పడిందని, తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఏడాదిపాటు ఈ వివాదం నడవడంతో మరమ్మతుల అంశం మరుగున పడిపోయింది. అయితే, ఈ విషయమై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. మరమ్మతులు చేపట్టాలని జెన్‌కోను ఆదేశించింది. మరమ్మతులకు రూ.3కోట్లు మాత్రమే ఖర్చు కానుండగా, అంతకు ఎన్నో రెట్లు విలువైన జల విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చన్న అంశాన్ని ప్రస్తావించింది. దీంతో మళ్లీ కొత్తగా టెండర్లు నిర్వహించడానికి జెన్‌కో యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. అయితే, మరమ్మతులు పూర్తయి 4వ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభం కావడానికి కనీసం మూడు నెలలు పడుతుందని, ఆలోగా కృష్ణాలో వరదలు తగ్గుముఖం పడుతాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో తెలుగోళ్ల హవా

» అగ్రరాజ్యంలో పెరుగుతున్న మనోళ్ల సంఖ్య

» 8 ఏళ్లలో నాలుగు రెట్ల పెరుగుదల

» 2016లో 3.2 లక్షలు.. 2024లో 12.3 లక్షలు

» ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగుది 11వ స్థానం

హైదరాబాద్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో తెలుగు.. వీధిలో తెలుగు.. యునివర్సిటీలో తెలుగు.. కార్యాలయంలోనూ తెలుగే.. ఇదేదో ఆంధ్రానో, తెలంగాణో అనుకుంటే పొరబడినట్టే! అగ్రరాజ్యం అమెరికాలోని కొన్ని ప్రాంతాల్లో ఇటీవలికాలంలో కనిపిస్తున్న పరిస్థితి ఇది. ఆ దేశంలో ఎక్కువ మంది మాట్లాడే 350 విదేశీ భాషల్లో తెలుగు 11వ స్థానంలో నిలిచింది. అమెరికాలో ఎక్కువగా మాట్లాడే భారతీయ భాషల జాబితాలో మనకన్నా ముందు హిందీ, గుజరాతీ ఉన్నాయి. కొన్నాళ్లుగా.. ఉన్నత విద్య, ఉపాధి కోసం ఇతర దేశాల నుంచి అమెరికాకు చేరుకుంటున్నవారిలో తెలుగువారి జనాభా గణనీయంగా పెరుగుతోంది. అమెరికా ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని అధికారికంగా స్పష్టం చేస్తున్నాయి. 2016తో పోలిస్తే 2024లో అమెరికాలో ఉంటున్న తెలుగువారి జనాభా నాలుగింతలు పెరిగిందని ఇటీవలే విడుదలైన యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా చెబుతోంది. ఆ నివేదిక ప్రకారం..

- 2016లో అమెరికాలో తెలుగు మాట్లాడేవారి సంఖ్య 3.2 లక్షలు ఉండగా..ఇప్పుడది 12.3 లక్షలకు చేరింది.
- తెలుగు జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో కాలిఫోర్నియా ప్రథమస్థానంలో ఉంది. అక్కడ 2 లక్షల మంది తెలుగువారున్నారు. తర్వాతటెక్సస్(1.5 లక్షలు), న్యూజెర్సీ(1.1లక్షలు), ఇల్లినాయ్(83 వేలు), వర్జీనియా(78వేలు), జార్జియా(52 వేలు) ఉన్నాయి.
- అమెరికాకు ఏటా వచ్చే మొత్తం విదేశీ విద్యార్థుల్లో తెలుగు విద్యార్థుల వాటా దాదాపు 13 శాతం.
- ఉపాధి కోసం వెళ్లేవారి సంఖ్యలోనూ ఏటా వృద్ధి నమోదవుతోంది. ఇతర దేశాలతో పోలిస్తే భారత్ నుంచి అత్యధికులు అమెరికాకు వెళ్తుండగా.. వీరిలో సింహభాగం తెలుగు రాష్ట్రాల నుంచే ఉంటున్నారు.
- అమెరికాలోని అనేక ప్రముఖ వర్సిటీల్లోని విదేశీ విద్యార్థుల్లో తెలుగు రాష్ట్రాల విద్యార్థుల వాటా పెరుగుతోంది. కెంట్ స్టేట్ వర్సిటీలో మనోళ్ల ప్రవేశాలు ఎక్కువగా ఉండడంతో 'విద్యార్థులకు స్వాగతం' అంటూ తెలుగులో ఆహ్వానం పలకడం పట్ల మన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
- ఏటా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 60 వేల నుంచి 70 వేల మంది విద్యార్థులు, 10 వేల మందికి పైగా హెచ్1బీ వీసాపై అమెరికాకు చేరుకోవడమే అక్కడ మన హవా ఇంతగా పెరడగానికి ప్రధాన కారణం. ఇండియన్ మొబిలిటీ రిపోర్ట్-2024 ప్రకారం.. చదువుకోవడానికి అమెరికా వెళ్తున్న భారతీయ విద్యార్థుల్లో మన తెలుగువారి వాటా ఏకంగా 12.5 శాతం!!

మాతృ భాష	2010	2021	వృద్ధి (శాతం)
తెలుగు	217641	459836	111.00%
తమిళం	181698	341396	88.00%
బెంగాలీ	221872	403024	82.00%
నేపాలీ, మరాఠీ, ఇండో-ఆర్యన్ భాషలు	275694	447811	63.00%
హిందీ	609395	864830	42.00%
మళయాళం, కన్నడ, ఇతర ద్రావిడ భాషలు	197550	280188	42.00%
ఉర్దూ	388909	507972	31.00%
పంజాబీ	243773	318588	31.00%
గుజరాతీ	356394	436909	23.00%

వృద్ధిరేటులో మనమే..

అమెరికాలో ఉండే అన్ని దేశాలవారు, జాతులవారు బయట మాట్లాడేది ఆంగ్లమైనా.. ఇంట్లో మాట్లాడేది మాత్రం మాతృభాషే. అలా ఆ దేశంలో ఉంటున్న భారతీయుల్లో.. ఇంట్లో మాతృభాష మాట్లాడే వారి సంఖ్య పెరుగుదలలో తెలుగువారిదే అగ్రస్థానం. 2010లో అక్కడ 2.17 లక్షల మంది ఇంట్లో తెలుగు మాట్లాడుతుండగా.. 2021 నాటికి వారి సంఖ్య 111 శాతం వృద్ధి రేటుతో 4.59 లక్షలకు చేరింది

పోతిరెడ్డిపల్లి జీపీ నిధుల అవకతవకలపై డీఎల్‌పీవో విచారణ

చేర్యాల, జూన్ 27 : 2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి జీపీలో చోటు చేసుకున్న అవకతవకల ఆరోపణలపై, సిద్దిపేట డీఎల్‌పీవో మల్లికార్జున్‌రెడ్డి గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన జీపీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి విచారణ నిమిత్తం సీజ్ చేసి తమ వెంట తీసుకు వెళ్లారు. 2016-17ఆర్థిక సంవత్సరంలో పంచాయతీ కార్యదర్శి రూ.2.43లక్షలు పక్కదోవపట్టించి అక్రమాలకు పాల్పడిందని అదే గ్రామానికి చెందిన కత్తుల భాస్కర్‌రెడ్డి పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై గతంలో డీఎల్‌పీవో విచారణ చేపట్టినా ఎలాంటి చర్యలు తీసుకోకపోగా, కొద్దిరోజుల క్రితం మరోమారు ఫిర్యాదు చేశాడు. తద్వారా పంచాయతీ కార్యదర్శి రూ.1లక్షకుపైగా జమ చేసింది. ఆమె అక్కడి నుంచి మరో చోటుకు వెళ్లిపోయింది. అయినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం పట్ల భాస్కర్‌రెడ్డి మరోమారు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో డీఎల్‌పీవో విచారణ చేశారు. ఆయన సదరు పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణను పిలిపించి విచారణ చేపట్టడంతో పాటు గతంలో డీఎల్‌పీవో ఇచ్చిన నివేదికను పరిశీలించారు. త్వరలో వివరాలు వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మహబూబ్ అలీ ఉన్నారు.

'వాహనాలు కండిషన్‌లో ఉండాలి'

సిద్దిపేట క్రైం, జూన్ 27: పోలీస్ వాహనాలు కండిషన్‌లో ఉండాలని పోలీస్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ధరణికుమార్ పోలీస్ వాహనాల డ్రైవర్లకు సూచించారు. గురువారం ఆయన పోలీస్ వాహనాలను కమిషనరేట్ కార్యాలయ ఆవరణలో మెకానిక్ సహాయంతో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. డ్రైవర్ ప్రతిరోజు వాహనం కండిషన్ గురించి తెలుసుకొని డ్రైవింగ్ చేయాలని సూచించారు.

విద్యుత్ సమస్య తీరేదెన్నడు!?

- కుకునూరుపల్లి మండల కేంద్రాన్ని వేధిస్తున్న సమస్య
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు, వ్యాపారస్తులు

కుకునూరుపల్లి, జూన్ 27: కుకునూరుపల్లి మండల కేంద్రాన్ని విద్యుత్ సమస్య వేధిస్తున్నది. నూతన మండలం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యుత్ సమస్య తీరడం లేదు. మండల కేంద్రంలో వర్షాకాలంలో అయితే ఈ సమస్య మరీ తీవ్రంగా ఉంటున్నది.

వ్యాపారం సాగేదెలా..

ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో విద్యుత్ ఉంటేనే ఏ వ్యాపారమైన నడిచేది. కానీ మండల కేంద్రంలో మాత్రం దీనికి భిన్నంగా ఉన్నది. విద్యుత్ సమస్య తీవ్రంగా ఉండడంతో వ్యాపారస్తులు ఎక్కువగా ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలో విద్యుత్ సమస్య తీవ్రత ఎక్కువగానే ఉంది. నూతన మండలం ఏర్పడడంతో వివిధ గ్రామాల నుంచి పలు పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. పని కోసం వ్యాపారస్తుల దగ్గరికి వెళ్లినప్పుడు కరెంట్ లేదని, రావడానికి సమయం పడుతుందని తెలపడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వినియోగదారులే కాకుండా వ్యాపారస్తులకు విద్యుత్ సమస్య చాలా ఇబ్బందిగా తయారైంది. కరెంట్ ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి. విద్యుత్ ఉంటేనే వ్యాపారం నడుస్తుంది. వేలకు వేలు షాపులకు కిరాయి చెల్లిస్తూ విద్యుత్ సమస్యతో ఇబ్బందులకు గురవుతున్నామని వ్యాపారులు వాపోతున్నారు.



కుకునూరుపల్లి గ్రామపంచాయతీ

పరిశ్రమలదీ ఇదే పరిస్థితి

కుకునూరుపల్లి గ్రామం చుట్టుపక్కల పలు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. విద్యుత్ సమస్యతో పరిశ్రమలో కూడా పనులు సరిగా జరగడంలేదని, కోట్లు వెచ్చించి పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న తమకు విద్యుత్ సమస్య ఇబ్బందిగా మారిందని వారు వాపోతున్నారు.

పూర్తి స్థాయిలో కార్యాలయాలు ఏర్పడితేనే..

మండల కేంద్రంలో విద్యుత్ ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి ఉన్నదని, ఎక్కడ ఏ చెట్టు విరిగినా కొమ్మ విరిగినా కరెంట్ సమస్య ఏర్పడుతున్నదని పలువురు గ్రామస్తులు తెలిపారు. నూతన మండలం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్నా ఈ విద్యుత్ సమస్యను అధికారులు పరిష్కరించలేకపోతున్నారు. మండల కేంద్రంలో ఒక్క తహసీల్దార్ కార్యాలయం మాత్రమే అందుబాటులో ఉన్నది. రానున్న రోజులలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేస్తే విద్యుత్ సమస్య మరింత తీవ్రతరం అయ్యే అవకాశం ఉన్నది. ఉండవచ్చు, ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



మండల కేంద్రంలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. ఏ సమయంలో విద్యుత్ ఉంటుందో ఏ సమయంలో పోతుందో కూడా తెలియని పరిస్థితి. దీనికి తోడు లో వోల్టేజ్ సమస్య కూడా ఏర్పడుతున్నది. అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

కె. కృష్ణ, స్థానికుడు కుకునూరుపల్లి

ప్రజలు సహకరిస్తే సమస్య పరిష్కరిస్తాం

మండల కేంద్రంలో 8 ట్రాన్స్‌ఫార్మర్స్ ఉన్నాయి. ఇవి గ్రామానికి వెలుపల ఉన్నాయి. వీటి మధ్య దూరం ఎక్కువగా ఉండడంతో సమస్య తలెత్తుతున్నది. మండల కేంద్రంలో అక్కడక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తే సమస్య తగ్గుతుంది. ఓ ఫంక్షన్‌హాల్ నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు ఐదు లైన్ల విద్యుత్ తీగలను ఏర్పాటు చేస్తే సమస్యే ఉండదు.

రాజేంద్రప్రసాద్, విద్యుత్ ఏఈ

రైతులకు మళ్లీ వరి విత్తనాలు అందిస్తాం



రామవరంలోని విత్తన దుకాణంలో విచారణ చేస్తున్న వ్యవసాయ అధికారి

అక్కన్నపేట, జూన్ 27: 'మొలకెత్తని వరి విత్తనాలు' అని ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 27న వచ్చిన వార్తకు వ్యవసాయ అధికారులు, కంపెనీ ప్రతినిధులు స్పందించారు. మండలంలోని రామవరంలో రైతులు మండే కట్టిన వరి విత్తనాలను వారు పరిశీలించారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో ఈ లాట్ లో జెర్మినేషన్ లోపం ఉందని గుర్తించి, ఆ సీడ్స్‌కు సంబంధించిన లాట్‌ను వాపస్ పంపించి, మళ్లీ వేరే లాట్‌కు సంబంధించిన విత్తనాలను తెప్పించి రైతులకు అందచేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈవో సింధుజ పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే అసత్య ఆరోపణలు

చేర్యాల, జూన్ 27: రాజకీయ ఉనికి కోసం సీపీఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై నిరాధార భూ కబ్జా ఆరోపణలు చేయడం తగదని యూత్ కాంగ్రెస్ మండల నాయకులు అరుట్ల వినీత్ పేర్కొన్నారు. గురువారం చేర్యాల పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతుల పక్షాన నిలబడటమే కాకుండా విద్యార్థులకు చదువునందించేందుకు విద్యాసంస్థలకు భూములను దానం చేసిన దార్శనికుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అని పేర్కొన్నారు. పెద్దచెరువు మత్తడి ఆవరణస్థలాన్ని కబ్జా కోరల నుంచి కాపాడిన కొమ్మూరిపై విమర్శలు చేయడం తగదన్నారు. సమావేశంలో నాయకులు జహురుద్దీన్, బుడిగె రమేశ్, నీలం చింటు, భూమని బాలరాజు, తుమ్మలపల్లి సంతోశ్, బుట్టి చందు, శ్రీకాంత్, మేర్గొజు శ్రీధర్, మహేందర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు రుణమాఫీ వర్తింపు చేయాలి

- సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ



విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణ

గజ్వేల్, జూన్ 27: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ భూనిర్వాసితులకు రుణమాఫీ వర్తింపు చేయాలని సీపీఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రిజర్వాయర్‌లలో భాగంగా నిర్వాసితుల దగ్గర 2016లో భూసేకరణ చేసే సమయంలో అప్పటి ప్రభుత్వం భూమి తీసుకున్నందున ప్రభుత్వమే రుణమాఫీ చేస్తుందని హామీ ఇచ్చి, తర్వాత పట్టించుకోలేదన్నారు. దీంతో పాత రుణాలు మాఫీ కాకపోవడంతో బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వడానికి నిరాకరించారన్నారు. ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు రుణాలు తీసుకున్న వారికే రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ప్రాజెక్టులో భాగంగా 2016లో భూములు కోల్పోయి అంతకుముందు రుణాలు తీసుకున్న భూనిర్వాసితులకు ఈ రుణమాఫీ వర్తించడం లేదని, కావున ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, భూనిర్వాసితులకు ప్రత్యేక జీవో జారీ చేసి రుణమాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పోచయ్య, రవి, రాజయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి

గజ్వేల్, జూన్ 27: గజ్వేల్ పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది నుంచి కో-ఎడ్యుకేషన్ ప్రారంభమైందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ కళాశాల గజ్వేల్‌లో దోస్త్ ద్వారా 16019 అనే కళాశాల కోడ్ ద్వారా అడ్మిషన్ పొందిన విద్యార్థి, విద్యార్థినిలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ సదుపాయం ఉందని తెలిపారు. గజ్వేల్ పరిసర ప్రాంతాల్లోని ఎక్కడా లేని ఎన్‌సీసీ అవకాశాన్ని బాలురతో పాటు బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ

తొగుట, జూన్ 27: మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు సిలివేరి మల్లారెడ్డి రూ. 18 వేలు విలువ చేసే నోట్ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉచితంగా నోట్‌బుక్స్ అందజేసిన మల్లారెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు ఘనంగా సన్మానించారు.

నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

మద్దూరు, జూన్ 27: క్రీడా పాఠశాల ఎంపికకు నేడు మండలస్థాయిలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో ఉదయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే పోటీలకు హాజరయ్యే విద్యార్థులు ఆధార్‌కార్డు, స్టడీ సర్టిఫికెట్ వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 9989132656 నెంబరును సంప్రదించాలని సూచించారు.

'ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేయాలి'

బెజ్జంకి, జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను బెజ్జంకి మండలంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని కోరుతూ, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు ఆర్టీఐ ప్రచార కమిటీ చైర్మన్ రాసూరి మల్లికార్జున్ గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ మాట్లాడుతూ.. మండలంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పడితే ఎంతో మంది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుతాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కొండపాక, జూన్ 27: మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి గురువారం పరామర్శించారు. విశ్వనాథపల్లిలో గొడుగు చంద్రం అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. దుద్దెడలో కొంక ప్రభాకర్ అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మద్దూరు ఎస్ఐకి వీడ్కోలు

మద్దూరు, జూన్ 27: కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీపై వెళుతున్న మద్దూరు ఎస్ఐ యూనస్ అహ్మద్ అలీకి స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సీఐ ఎల్. శ్రీను పాల్గొని ఎస్ఐకి శాలువ కప్పి సన్మానించారు.

మిషన్‌భగీరథ సర్వేను వేగవంతం చేయాలి

- ఎంపీడీవో రామ్మోహన్



ధర్మారంలో మిషన్‌భగీరథ నల్లా కనెక్షన్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

మద్దూరు, జూన్ 27: మిషన్‌భగీరథ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. మండలంలోని సలాఖ్‌పూర్, మర్మాముల, ధర్మారం గ్రామాలను గురువారం సందర్శించి మిషన్‌భగీరథ సర్వే పనుల్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధిహామీ పనులకు సంబంధించి జాబ్‌కార్డుల అప్‌డేషన్‌తో పాటు 7 రకాల రిజిస్టర్లతో పాటు జీపీ రిజిస్టర్లను పరిశీలించారు. ధర్మారం గ్రామంలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు కిరణ్, రేణుక, అశోక్ ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు. రైతులకు ఉపయోగపడే ఫామ్స్‌పాండ్స్‌తో పాటు పశువుల షెడ్లను గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి ఇవ్వాలని ఎంపీడీవో ఎస్. రామ్మోహన్ పంచాయతీ సెక్రటరీలకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఎక్కువగా ఫామ్‌పాండ్స్‌తో పాటు పశువుల షెడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ఖాజామొయినుద్దీన్, ఈసీ పరుశురాములు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ లక్ష్మీతో పాటు పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

- గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్, జూన్ 27: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ రాజమౌళి పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో 18వ వార్డులోని భరత్‌నగర్ కాలనీలో డ్రైడే కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై, దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. దోమల నివారణకై డెమోఫాస్ మందును మురికి కాలువల్లో పిచికారి చేయించారు. మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో... ఇంటి పరిసరాలను కూడా అదే విధంగా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

'స్థానిక' ఎన్నికలకు సిద్ధం కావాలి: డీఎస్పీ

బెజ్జంకి, జూన్ 27: స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్ మహరాజ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కార్యకర్తలతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ కమిటీలు నిర్మాణం, సభ్యత్వాల చేరిక చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ప్రజలకు వివరించాలని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థులు పోటీలో ఉండేందుకు సిద్ధ పడాలని సూచించారు. అనంతరం మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సురేష్, ఉపాధ్యక్షుడిగా విజయ్, ప్రధాన కార్యదర్శిగా అంజి, కార్యవర్గ సభ్యులుగా సూరజ్, దినేష్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ధర్మ స్టూడెంట్ యూనియన్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి లింగాల సురేష్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ అర్చకుడికి అర్చక రత్న బిరుదు

మద్దూరు, జూన్ 27: మండల కేంద్రానికి చెందిన పానుగంటి తిరుపతయ్య చార్యులకు హైద్రాబాద్‌లో విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ అర్చక పురోహితులకు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు కార్యక్రమంలో, గురువారం తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వ పురోహిత అర్చక బిరుదుతో సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర పురోహితుల సంఘం అధ్యక్షుడు నర్సింహాచార్యులు, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బాలబ్రహ్మాచార్యులు తదితరులు ఉన్నారు.

జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడికి సన్మానం



జడ్పీ కోఆప్షన్ సభ్యుడిని సన్మానిస్తున్న దృశ్యం

దౌల్తాబాద్, జూన్27: సిద్దిపేట జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం 21వ చివరి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రానికి చెందిన జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ రహీమొద్దీన్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిలు శాలువ కప్పి సన్మానించారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైంది

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



రాజలింగారెడ్డి దంపతులను సన్మానిస్తున్న హరీశ్‌రావు

చిన్నకోడూరు, జూన్ 27: సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో విలువైనదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పెద్దకోడూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన రాజలింగారెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో గురువారం ఆయన మాట్లాడారు. రాజలింగారెడ్డి దంపతులను శాలువాతో సన్మానించారు. అంతకు ముందు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి పాల్గొని రాజలింగారెడ్డి దంపతులను సన్మానించారు. ఉపాధ్యాయునిగా రాజలింగారెడ్డి చేసిన సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏంఈవో యాదవరెడ్డి, ఎంపీటీసీ సాయన్న, మాజీ సర్పంచ్ లింగం, పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీని పరామర్శించిన హరీశ్‌రావు

ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమై విశ్రాంతి తీసుకుంటున్న ఎంపీపీ మాణిక్యరెడ్డిని మండలంలోని గోనెపల్లిలో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు.

డబుల్ బెడ్ రూం ఇళ్లను ఖాళీ చేయించడం సరైంది కాదు

- ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



గ్రామస్థులతో మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక, జూన్ 27: మండలంలోని ఖమ్మంపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించడం సరికాదని బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మంపల్లి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మంపల్లిలో 60 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి 41 ఇళ్లను నిరుపేదలకు కేటాయించిందన్నారు. ఎన్నికలు సమీపించిన క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన 19 ఇళ్లను కూడా లబ్ధిదారులను పంపిణీ చేసిందన్నారు. అక్కడ ఉంటున్న వారిని అధికారులు ఖాళీ చేయించడం సరైనది కాదన్నారు. మానవతా దృక్పదంతో నిరుపేదలైన వారికి ఇళ్లను ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి ఇండ్లు కేటాయించే వరకు అండగా ఉంటానని పేర్కొన్నారు.ఆయన వెంట బీ ఆర్ ఎస్ నాయకులున్నారు.

బస్వాపూర్‌లో పాడి రైతుల నిరసన



పాల కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

కోహెడ, జూన్ 27: మండలంలోని బస్వాపూర్‌లో కరీంనగర్ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సంస్థ పాల రేటు తగ్గించిందని రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. విజయ, ముల్కనూర్ పాల డైయిరి సంస్థల్లో పాల రేటు ఎక్కువగా ఉన్నదని, అంతే రేటు ఇవ్వలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన వ్యక్తం చేశారు. ఆరు నెలలల్లో రూ,7 తగ్గించారని పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ కర్ణాకర్ రెడ్డి, డాక్టర్ ప్రసన్న కుమార్‌లను పాల కేంద్రం భవనంలో తాళం వేసి నిర్బంధించి కాసేపటికి వదిలేశారు. ఈ సందర్భంగా పాడి రైతులు మాట్లాడుతూ.. దానా రేట్లు పెరుగుతున్నాయని, పాల, పెరుగు ప్యాకెట్ల రేట్లూ పెంచారన్నారు. వివిధ పాల వస్తువుల రేట్లు భారీగా పెంచుకుంటూనే, రైతులు వాననక, ఎండనక కష్ట నష్టాలను ఓర్చుకుని పశువులకు సేవ చేసి పాలను ఉత్పత్తి చేస్తే, తమకు మాత్రం కరీంనగర్ డైయిరీ తీవ్ర నష్టం మిగులుస్తుందన్నారు. విజయ, ముల్కనూర్ డైరీలు రైతులకు మేలు చేస్తుంటే కరీంనగర్ డైరీ వాళ్లు మాత్రం రైతులను దోపిడీ చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కోరారు.

చెంచు మహిళపై మానవమృగాలు చేసిన హింసను ఖండిద్దాం

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, జూన్ 27: చెంచు మహిళను అత్యంత అమానవీయంగా హింసించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ఘటనను ప్రజలంతా ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఆయనవెంట డీబీఎఫ్ నాయకులు చంద్రం, సత్తయ్య పాల్గొన్నారు.

పౌరహక్కుల దినం నిర్వహించని అధికారుల పై చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ మాలమహానాడు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కోదాది శ్రీనివాస్

సిద్దిపేట రూరల్, జూన్ 27: ప్రతినెల 30వ తేదీన తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఏదో ఒక గ్రామంలో పౌరహక్కుల దినం నిర్వహించని అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని తెలంగాణ మాలమహానాడు సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కోదాది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్ లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పౌరహక్కుల దినం రోజున మండల స్థాయిలో తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో, పోలీస్ అధికారులతో పాటు అన్నిశాఖల అధికారులు గ్రామంలో వివిధ కుల సంఘాలు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కోనోకార్పస్ చెట్లు తొలగించరూ..!?

- పూలు, నీడనిచ్చే మొక్కలు నాటాలి
- చేర్యాల పట్టణ ప్రజల వేడుకోలు

చేర్యాల, జూన్ 27: పక్షులు వాలకపోగా, ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లచేసే కోనోకార్పస్ చెట్లు, మొక్కలను తొలగించాలని చేర్యాల పట్టణ ప్రజలు కోరుతున్నారు. హరితహారం పేరిట జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారికి ఇరుపక్కల, డివైడర్లలో కొన్నాళ్లక్రితం కోనోకార్పస్ మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి పచ్చదనం రూపుదిద్దుకున్నప్పటికీ మానవులు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారినపడతారని, ప్రాణాంతకరమైనవిగా ప్రచారం జరుగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. పట్టణాన్ని హరితమయంగా తీర్చిదిద్దేందుకు కుడిచెరువు ప్రాంగణంలో నర్సరీని ఏర్పాటుచేశారు. వీటిలో పలు రకాల పూల మొక్కలు, కదంబ మొక్కలున్నప్పటికీ అధికడబ్బులు వెచ్చించి పొరుగు ప్రాంతాల నుంచి కోనోకార్పస్ మొక్కలు తెప్పించి నాటారు. దీంతో పట్టణం కాస్త పచ్చదనం సంతరించుకున్నప్పటికీ నర్సరీలలో పూలు, నీడనిచ్చే మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎవరూ పట్టించుకోకపోవడంతో మొక్కలు మూలుగుతున్నాయి. మరికొన్నింటిని విత్తనాలు వేయడానికి కవర్లలో మట్టిని నింపి సంసిద్ధం చేసినప్పటికీ సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కోనోకార్పస్ మొక్కల వల్ల జరుగుతున్న నష్టంపట్ల సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం కొనసాగుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి నిర్మాణం పనుల్లో రోడ్డు పక్కనగల భారీవృక్షాలు, చెట్లు తొలగించినప్పటికీ డివైడర్లలోని మొక్కలు ప్రమాదకరంగా మారాయి. పట్టణ శివారులోని పెట్రోల్‌పంప్ నుంచి మార్కెట్‌యార్డు అవతలి వరకు డివైడర్లలో మొరం పోసి సుందరీకరిస్తున్న క్రమంలో కోనోకార్పస్ మొక్కలు తొలగించాలని, వాటిస్థానంలో పూలు, నీడనిచ్చెమొ క్కలునాటి ప్రజారోగ్యం పరిరక్షించాలని పట్టణప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



డివైడర్లలో మధ్యలో పెరిగిన కోనోకార్పస్ చెట్లు

రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

- సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఆముదాల మల్లారెడ్డి

చేర్యాల, జూన్ 27: కొమురవెల్లి మండలకేంద్రంలో ఈనెల 30, జూలై 1వతేదీలలో నిర్వహించే పార్టీ రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రస్తుత రాజకీయ నాయకులు సేవాభావంతో వ్యవహరిస్తూ, ప్రజాసమస్యల పరిష్కారానికి పాటుపడాలని కోరారు. జిల్లాలో అనేక ఉద్యమాలు నిర్వహించి ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఎం కృషి చేసిందని, సంస్థాగత బలోపేతం కోసం నిర్వహించనున్న రాజకీయ శిక్షణా తరగతులకు జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, కృష్ణారెడ్డి, అరుణ్‌కుమార్, శారద, మల్లేశం, ఇస్తారి, బాలకిషన్ పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్, జూన్ 27: ప్రభుత్వం ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి నామినేటెడ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్‌లో ఉంటూ, ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ నాయకులను రెచ్చగొడుతూ పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా సోషల్‌మీడియాలో తప్పుడు సమాచారం పంపిస్తున్న నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్‌పై పోటీ చేసిన నర్సారెడ్డికి నామినెటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇస్తామని, పార్టీ కోసం పని చేసే కార్యకర్తలకు, నాయకులకు గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నరేందర్‌రెడ్డిని కలిసిన వారిలో నెంటూరు రంగారెడ్డి, వంటేరు నరేందర్ రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, సాజిద్ బేగ్, సర్దార్‌ఖాన్, రవిందర్‌రెడ్డి, జహీర్, బంగార్‌రెడ్డి, అనంతుల నరేందర్, మహేందర్‌రెడ్డి, వాసరి లింగారావు, తీగుల్ మహేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సతీష్ రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ మతీన్, నక్క రాములు, అజహర్, సురేశ్ తదితరులున్నారు.

తండ్రిని కోల్పోయిన ముగ్గురు కూతుళ్ల విద్యకు ఎమ్మెల్యే పల్లా భరోసా

చేర్యాల, జూన్ 27: చనిపోయిన బీఆర్‌ఎస్ కార్యకర్త కుటుంబానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అండగా నిలిచారు. మృతుడి కుటుంబ దీనపరిస్థితికి చలించారు. మృతుడి ముగ్గురు కూతుళ్ల విద్యకోసం భరోసా కల్పించి, విద్యాభిమానాన్ని చాటుకున్నాడు. చేర్యాల మండలం ముస్త్యాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు మేరిండ్ల శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడికి రిషిత, నైనిక, స్ఫూర్తి ముగ్గురు కూతుళ్లు. పెద్దకూతురు డిగ్రీ, రెండో కూతురు పదోతరగతి, మూడో కూతురు రెండో తరగతి చదువుతున్నారు. పలువురు ఆర్థికసహాయం అందించినప్పటికీ ముగ్గురు ఆడపిల్లలు భవిష్యత్తుపై ఆందోళనకు గురవుతున్నారు. ఈక్రమంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం కుటుంబసభ్యులను పరామర్శించారు. ముగ్గురు ఆడపిల్లల చదివించే బాధ్యత తనదేనని, ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. అంతకు ముందు ఇటీవల పితృవియోగం చెందిన బీఆర్‌ఎస్ చేర్యాల పట్టణ కార్యదర్శి బూరుగు తిరుపతిగౌడ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, కౌన్సిలర్ మంగోలు చంటి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, నాయకులు శివగారి అంజయ్య, పచ్చిమడ్ల సిద్దిరాములు, ఏర్పుల మహేశ్, కోతి విజయ్, నర్ర అయిలయ్య, గొట్టం జితేందర్‌రెడ్డి, సాయినందన్ తదితరులు పాల్గొన్నారు.

నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

హుస్నాబాద్ జూన్ 27: హుస్నాబాద్ పట్టణంలో గురువారం సాయంత్రం నార్కోటిక్ డాగ్స్‌తో వివిధ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్‌తో పాటు ఇతర మత్తు పదార్థాలపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు.